# రంగంలోకి అధికారులు



పెద్దనాగారంలో పడిపోయిన వరిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ

- పంట నష్టంపై అంచనా..
- క్షేత్రస్థాయిలో దెబ్బ తిన్న పంటల పరిశీలన

మహబూబాబాద్ డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : మిగ్‌జాం తుఫాన్ కారణంగా జిల్లాలో మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేశాయి. చేతికందే దశలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. ఇన్ని రోజులు కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు నీటిపాలవడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కోత దశకు వచ్చిన వరి పొలం నేల వాలగా, కోసిన వరిమెదల్లోకి వాన నీళ్లు చేరడంతో వడ్లు నల్లబడుతాయని ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయి. వెంటనే సర్కారు ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. కాగా, నష్టపోయిన పంటలను పరిశీలించి, సర్కారు నివేదిక ఇచ్చేందుకు అధికారులు దిగారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఏఈవోలు, ఏవోలు కలిసి గ్రామాలవారీగా తిరుగుతున్నారు. దెబ్బతిన్న పొలాలు, చెలకల వద్దకు పంటలను పరిశీలిస్తున్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. గ్రామాలు, మండలాల్లో పర్యటిస్తున్న అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి, తుది నివేదిక కలెక్టర్‌కు నివేదించనున్నారు. ఇదిలా ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే తెచ్చిపోసిన ధాన్యపు రాశులు తడిముద్దయ్యాయి. వాటిని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తడిసి రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నష్టపోయిన పంటలు, కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని సీపీఐ ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ.. నష్టపోయిన పంటలు, కల్లాలను అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనాలన్నారు. తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొని రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ అజయ్ సారధిరెడ్డి, తండ సందీప్, పొలగాని శ్రీను, శేఖర్, తండ సతీశ్, విజయ్, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో రామారావు

## వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

**డీఈవో రామారావు**

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 7 : తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో రామారావు అన్నారు. గురువారం మండలంలోని పర్వతగిరి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి యాప్ ద్వారా విద్యార్థులను ప్రశ్నిస్తూ సమాధానాలు రాబట్టాలన్నారు. బేస్‌లైన్ ఆధారంగా తరగతుల వారీగా వారి సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ప్రతి పాఠశాలలో టీచర్స్ తప్పనిసరిగా డైరీలను పెట్టి రోజు వారీ విషయాలను నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్నతి, నూతన విద్యా విధానం అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

## కోదండరామ్‌కు సముచిత స్థానం కల్పించాలి

కేసముద్రం, డిసెంబర్ 7 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించిన టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరామ్‌కు సముచిత స్థానం కల్పించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ బాణాల నాగరాజు కోరారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా సేవలో ముందంజలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, చాంద్, రమేశ్, రోహిత్, మహేశ్, గణేశ్, జీవిత, ప్రియ, రమ్య, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

**బీసీఐ ప్రాజెక్టు సమన్వయకర్త తరాల తిరుపతి**

శాయంపేట, డిసెంబర్ 7: బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని బీసీఐ ప్రాజెక్టు సమన్వయకర్త తరాల తిరుపతి అన్నారు. నేరెడుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల కార్మిక నిర్మూలన చట్టాలపై డబ్ల్యూ డబ్ల్యూఎఫ్ ఆర్థిక సాయంతో ప్రజ్వల ఎఫ్‌పీసీఎల్ బీసీఐ ప్రాజెక్టు ద్వారా బాల కార్మికులు, పురుగు మందులపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ బాల కార్మిక నిరోధక చట్టం, ఐఎల్‌వో 138 ప్రకారం వ్యవసాయ పనులను 14 ఏళ్లలోపు పిల్లలతో చేయించొద్దని సూచించారు. విద్యార్థులు బాలకార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా బడీడు పిల్లలు పనుల్లోకి వెళ్లకుండా బడికే వెళ్లి చదువుకోవాలన్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు పురుగు మందు పిచికారీ సమయంలో ఆ ప్రాంతానికి వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుచరిత, ఉపాధ్యాయులు, బీసీఐ ఫీల్డ్ ఫెసిలిటేటర్ షేక్ గౌస్, పోతు సునీల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బీసీఐ ప్రతినిధులు, టీచర్లు



రైతులకు లేగదూడలను అందజేస్తున్న మహేశ్ అగర్వాల్

## గోసంరక్షణతోనే వ్యవసాయానికి మనుగడ

**గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు**

**మహేశ్ అగర్వాల్**

వర్ధన్నపేట, డిసెంబర్ 7 : రైతులు గోవులను సంరక్షించుకోవడంతోనే భవిష్యత్‌లో వ్యవసాయానికి మనుగడ ఉంటుందని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేశ్‌అగర్వాల్ సూచించారు. వర్ధన్నపేట పట్టణ శివారులోని జగ్గిపేటలో భారత్ గోశాల ఆధ్వర్యంలో 20 మంది రైతులకు 40 లేగ దూడలను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మహేశ్ అగర్వాల్ హాజరై లేగదూడలు పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు కేవలం రసాయనిక ఎరువులపై ఆధారపడి ఏటా పంటలను సాగు చేస్తున్నారన్నారు. దీంతో పంటలు విషతుల్యంగా మారి ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్నాయన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సంప్రదాయ పద్ధతిలో గోవులను సంరక్షించుకొని గోవుల పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను వాడి పంటలను పండిస్తే రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్, సూపరింటెండెంట్ దుర్గం రోజా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాకూబ్‌నాయక్ పాల్గొన్నారు.



వరదకు దొడ్డ వాగు వద్ద కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

## కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

ఏటూరునాగారం, డిసెంబర్ 7 : మండలంలోని దొడ్డ వాగుపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు తుఫాన్‌కు వచ్చిన వరదకు కొట్టుకుపోయింది. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని రాకపోకలకు అంతరాయం కలుగొద్దని వాగుపై రూ. 20 లక్షలతో యుద్ధప్రాతిపదికన డైవర్షన్ రోడ్డు నిర్మించారు. కాగా వర్షాల కారణంగా వచ్చిన వరదతో ఆ రోడ్డు కాస్త సగం వరకు కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు తెగిపోయిన డైవర్షన్ రోడ్డుకు మళ్లీ మరమ్మతులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## పోలీసుల ముమ్మర తనిఖీ

మహదేవపూర్, డిసెంబర్ 7 : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గురువారం మండలంలోని అంబట్‌పల్లి ప్రధాన రహదారిపై వాహనాలతో పాటు వాహనదారుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులు సంచరిస్తే సమాచారమివ్వాలని గ్రామస్తులకు సూచించారు. పోలీసులు ధనుంజయ్, కిషన్, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాపురం (నూగూరు)లో..**

వెంకటాపురం (నూగూరు) : ము లుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలోని ఆలుబాక గ్రామ స మీపంలో ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలో గురువారం ము మ్మర తనిఖీలు ని ర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో బ్యాగులను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల పూర్తి సమాచారాన్ని సేకరించి పంపించారు.

# కాంగ్రెస్ నాయకుల సంబురాలు

గూడూరు, డిసెంబర్ 7 : సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నాయకులు స్వీట్స్ పంచిపెట్టి, పటాకులు కాల్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రసూల్, నాయకులు అల్లెం వీరస్వామి, పెరాల సురేందర్, హుస్సేన్, పాషా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దంతాలపల్లిలో..**

దంతాలపల్లి : నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శేను రాజేశ్, నెల్లూరు రవి, మధు, దిలీప్‌రెడ్డి, నరేశ్, వెంకటేశ్వర్లు, కృష్ణ, వెంకన్న, నవీన్, సందీప్, ఉపేందర్, అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు : సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



దంతాలపల్లిలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు